www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 27 మే 2025

5

పశ్చిమ గోదావరి

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి భీమారావు

ప్రజాశక్తి - భీమవరం

అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీ, సూపర్ సిక్స్ హామీల అమలు కోరుతూ జూన్ రెండో తేదీన తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడగా, నేతలు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, వైవి.ఆనంద్, మల్లుల శ్రీనివాసరావు, నాగిడి శాంతమూర్తి పాల్గొన్నారు.

కాంట్రాక్టులో 'ఆరోగ్యం'..!

- కీలకమైన ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ప్రాతిపదికనే ఉద్యోగ నియామకాలు
- వైద్యులు, నర్సులు అన్ని విభాగాల్లోనూ కాంట్రాక్ట్ ఉద్యోగులే
- రూ.12 వేల నుంచి రూ.25 వేలలోపే జీతాలు
- రెగ్యులర్ ఊసే మరిచిన పాలకులు
- కరోనాలోనూ ప్రాణాలకు తెగించి పని చేసిన ఆరోగ్య శాఖ సిబ్బంది
- జిల్లాలోని ఆరోగ్య విభాగాల్లో వేల సంఖ్యలో కాంట్రాక్ట్ ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రజల ప్రాణాలకు సంబంధించిన అతి కీలకమైన ఆరోగ్యశాఖలో రెగ్యులర్ ఉద్యోగులు కనుమరుగవుతున్నారు. ఆరోగ్యశాఖలో ఉద్యోగ నియామకాలన్నీ పూర్తిగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికనే ప్రభుత్వం భర్తీ చేస్తోంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన పాలకులు ఆరోగ్యశాఖను పూర్తిగా కాంట్రాక్ట్‌మయంగా మార్చేస్తున్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ ఉద్యోగ భరోసా, సమాన పనికి సమానవేతనం వంటివి ఏ ఒక్కటీ అమలు కాకపోవడంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో నైరాశ్యం అలుముకుంటుంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆరోగ్యశాఖలోని ఉద్యోగుల్లో 50 శాతం వరకూ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఉన్నట్లు తెలుస్తోంది. రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య తగ్గిపోతుంది. ఆరోగ్యశాఖలో మూడు విభాగాలుగా వైద్యసేవలు అందుతాయి. జిల్లా ఆరోగ్యశాఖ డిఎంహెచ్ఒ ఆధ్వర్యంలో పిహెచ్‌సిల పర్యవేక్షణ సాగుతోంది. జిల్లా, ఏరియా, కమ్యూనిటీ హెల్త్ ఆసుపత్రులన్నీ డిసిహెచ్ఎస్ పర్యవేక్షణలో పని చేస్తాయి. ఏలూరులోని బోధన ఆసుపత్రి మెడికల్ బోర్డ్ నియమించే సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో పని చేస్తోంది. ఈ మూడు విభాగాల్లోనూ అత్యధికంగా కాంట్రాక్ట్ ఉద్యోగులే పని చేస్తున్నారు. రెండు జిల్లాల్లోనూ ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో వేల సంఖ్యలో కాంట్రాక్ట్ ఉద్యోగులే ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆసుపత్రుల్లో కీలక పాత్ర పోషించే పిహెచ్‌సి వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఫార్మాసిస్టులు, ఎఫ్ఎన్ఒలు, ఎంఎన్ఎలు, అటెండర్లు ఇలా అన్ని విభాగాల్లోనూ కాంట్రాక్ట్ ఉద్యోగులే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో ఆరోగ్యశాఖలో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రాణాలకు తెగించి మరీ పని చేశారు. వీరికి ఇచ్చే వేతనాలు మాత్రం అంతంతమాత్రమే. వైద్యులకు తప్ప, మిగిలిన ఉద్యోగులు రూ.12 వేల నుంచి రూ.25 వేలలోపే జీతం అందుకుంటున్న వారే అత్యధికంగా ఉన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ జీతాల్లో పెరుగుదల లేకపోవడంతో కాంట్రాక్ట్ ఉద్యోగులంతా ఆర్థికంగా నలిగిపోతున్నారు. రెగ్యులర్ ప్రాతిపదికన పని చేసే స్టాఫ్ నర్సుకు రూ.70 వేలు జీతం ఉంటే, కాంట్రాక్ట్‌లో పని చేస్తే అదే ఉద్యోగికి రూ.25 వేలు మాత్రమే. పనిలో మాత్రం ఎటువంటి తేడా ఉండదు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని న్యాయస్థానాలు చెబుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి.

ప్రతియేటా రెన్యువల్ చేయాల్సిందే..

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేసే ఉద్యోగుల పట్ల ఆరోగ్యశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. తమకు అనుకూలంగా ఉంటే ఒకలా.. లేకపోతే కక్ష సాధింపులకు పాల్పడటం వంటివి జరుగుతున్న పరిస్థితి ఉంది. గతంలో కొంతమంది ఉద్యోగులను ఉద్దేశపూర్వకంగా దూరంగా పంపించి ఇబ్బంది పెట్టడంపై బాధితులు ఉన్నతాధికారులను కలిసి పెద్దఎత్తున పోరాటం చేసిన పరిస్థితి ఉంది. కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రతియేటా రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. ఈ రెన్యువల్ చేయడం ఆలస్యమైతే రెండు, మూడు నెలలు జీతాలు నిలిచిపోతాయి. అంతేకాకుండా రెగ్యులర్ చేసే సమయంలో ఆరోగ్యశాఖలో పని చేసే కొంతమంది అధికారులు మామూళ్లు సైతం వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆరోగ్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తే వైద్యసేవల్లో మరింత నాణ్యత పెరిగే పరిస్థితి ఉంటుంది. ప్రజలకు మరింత మేలు జరగనుంది.

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

పిజిఆర్ఎస్ అర్జీలకు నిర్ణీత సమయంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి 192 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలు పరిశీలించి నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారుని ఇంటికెళ్లి స్వయంగా పరిశీలించి పరిష్కారం చూపితే పిజిఆర్ఎస్‌పై ప్రజలకు నమ్మకం, అధికారులపై గౌరవం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం ఆధ్వర్యాన సిద్ధాంతం కాలనీ వాసుల వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

వినతిపత్రం అందసేస్తున్న కాలనీ వాసులు

ప్రభుత్వ కాలనీలో తిష్ట వేసిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన సిద్ధాంతం కాలనీవాసులు ఆ గ్రామ సర్పంచి చింతపల్లి గనిరాజు, కార్యదర్శి వై.కిషోర్‌బాబుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఐదేళుగా కాలనీలో తాగునీరు, వీధిలైట్లు, రోడ్లు, కాల్వ రేవు లేక ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. దీనిపై స్పందించిన సర్పంచి గనిరాజు వెంటనే కాలనీకి వెళ్లి సమస్యలు పరిశీలించారు. తాగునీటి బోరు, రోడ్లు, వీధిలైట్ల ఏర్పాటు, కాల్వలో ఒక రేవు నిర్మాణానికి హామీ ఇచ్చారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు అంజూరు శ్రీనివాసు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి ఎస్‌కె.పాదుషా, నేత కప్పల రత్నరాజు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడి కార్మికులను రక్షించండి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు - కలెక్టరేట్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు

విశాఖ స్టీల్‌ప్లాంటును కాపాడి కార్మికులను రక్షించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు అన్నారు. అన్యాయంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అనంతరం పిజిఆర్ఎస్‌లో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. ప్రభుత్వ పరిశ్రమ స్టీల్‌ప్లాంట్‌కు సొంత ఐరన్ గనులు కేటాయించకపోవడం దారుణమన్నారు. అనేకమంది ప్రాణత్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించే చర్యలను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసిందని, దీన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. అనేక ఏళ్లుగా సంస్థలో పని చేస్తున్న వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులను అన్యాయంగా తొలగించడం దారుణమన్నారు. వెంటనే తొలగించిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లాభాల్లో నడుస్తున్న పరిశ్రమలను ఎందుకు ప్రయివేటీకరిస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజల ముందు దోషిగా నిలబడక తప్పదని హెచ్చరించారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మోడీ యోగా కోసం విశాఖ వస్తున్నారని, అయితే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే ప్రయత్నం ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాసరావు, ఎం.ఆంజనేయులు, పిపిఎస్ నాయకులు ఎం.వైకుంఠరావు, రైతుసంఘం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : డిఆర్ఒ

ప్రజాశక్తి - భీమవరం

యోగా చేస్తున్న డిఆర్ఒ వెంకటేశ్వర్లు

నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయుష్, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో యోగా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్ ఆడిటోరియంలో యోగా అభ్యాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని అన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది యోగాంధ్ర వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవడంతోపాటు ప్రజలు, విద్యార్థులూ నమోదు చేసుకునేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ ఇ.నారాయణ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ హరి శ్రీనివాస్, జిల్లా టూరిజం అధికారి ఎ.అప్పారావు, యోగా శిక్షకులు చంద్రశేఖర్, తహశీల్దార్లు, వివిధ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు, ఆయుష్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తాళ్లకోడు కాలనీవాసుల ధర్నా

మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ - ఆర్‌డిఒ హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - ఆకివీడు

ఎండిఒ కార్యాలయం వద్ద బిందెలతో నిరసన తెలియజేస్తున్న కాలనీ వాసులు

మండలంలోని తాళ్లకోడు జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తక్షణం తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కాలనీవాసులు స్థానిక ఎంపిడిఒ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు వందలాది మంది మహిళలు ఖాళీ బిందెలతో వచ్చి బైఠాయించారు. మున్సిపల్ కమిషనర్ రావాలని, తాళ్లకోడు కాలనీకి నీటి సరఫరా నిలిపివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర పంచాయతీ వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా చేయాలని కోరారు. కాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని, కాలనీలో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని, విద్యుద్దీపాలను ఏర్పాటు చేయాలని, రోడ్లు డ్రెయినేజీలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పెద్దఎత్తున నినదించారు. దీంతో ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ పౌరుల సంక్షేమ సంఘం కన్వీనర్ బివి.వర్మ, సిఐటియు నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, ఐద్వా నాయకులు డోకల లక్ష్మి, రైతుసంఘం నాయకులు ఎస్.సూరిబాబు, డివైఎఫ్ఐ నాయకులు బి.రాంబాబు, డి.రవితేజ తదితరులు మాట్లాడుతూ కాలనీ ప్రజల ఇబ్బందులను వివరించారు. ఈ నెల 23న సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రిన్సిపల్ సెక్రెటరీ అజయ్ జైన్‌కు కాలనీవాసులు తమ సమస్యలను చెప్పడంపై ఆగ్రహించిన కొంతమంది నాయకులు కాలనీకి వచ్చే నీటి సరఫరా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలనీవాసులను ఆకివీడు మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడంలేదన్నారు. పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని మున్సిపాలిటీ చెత్త వాహనాలను పంపించి శుభ్రం చేయాలని విజ్ఞప్తి చేశారు. రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాల కల్పనకు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్‌డిఒ మాట్లాడుతూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, తక్షణమే ప్రతిరోజూ మున్సిపాలిటీ ద్వారా మూడు వాటర్ ట్యాంకులను పంపిస్తామని హామీ ఇచ్చారు. వారానికి ఒక రోజు ఆకివీడు మున్సిపాలిటీ చెత్త వాహనాలు పంపించి శుభ్రపరుస్తారని తెలిపారు. భవిష్యత్తులో వెంకయ్య వయ్యేరు కాలువ నుండి వస్తున్న నీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రేషన్ షాపును కాలనీలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ చెప్పారు. కాలనీ సమస్యలపై నివాసులతో, అధికారులతో త్వరలోనే జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు తమ ధర్నాను విరమించారు.

సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ కమిషనర్, ఛైర్‌పర్సన్‌కు సచివాలయ సిబ్బంది వినతి

ప్రజాశక్తి - నరసాపురం

మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకట రమణకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

పట్టణ పరిధిలో పనిచేస్తున్న వార్డు సచివాలయ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్యకు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకట రమణకు విన్నవించుకున్నారు. అనంతరం వినతిపత్రాలు అందజేశారు. సిబ్బంది కొరతతో సతమతమవుతున్నామని, రేషనలైజేషన్‌లో భాగంగా ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సచివాలయాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి మౌలిక సదుపాయాల కొరతను తీర్చాలన్నారు. ఇంటింటి సర్వేలపై ప్రజలకు అవగాహన నిమిత్తం మైక్ ప్రచారం చేయించాలని, అలాగే ఇతర సమస్యలను విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.జోసఫ్ కిషోర్, నరసాపురం మండల అధ్యక్షులు పి.మదన్మోహన్, సంఘం నాయకులు ఇ.ఉదయ్‌కుమార్, అడపా సత్యనారాయణ, డి.కృష్ణ, జి.గోపాలకృష్ణ, ఎన్.అశోక్‌రాయుడు, ఎన్.దివ్య, ఎల్‌జి.కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల ప్రక్షాళనతోనే అభివృద్ధి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

నియోజకవర్గ అభివృద్ధి కాలువల ప్రక్షాళనతో సాధ్యమని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. నవాబుపాలెం నుంచి ముత్యాలమ్మపురం వరకూ, ఉప్పాకపాడు వ్యవసాయ చెక్‌పోస్ట్ దగ్గర సప్లమెంటరీ బోదె పంట కాలువ ఆధునికీకరణ పనులను, పెంటపాడు మండలం రావిపాడు వ్యవసాయ బోదె పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కాలువలను ఆధునికీకరించి రైతులకు సాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం మురుగునీరు వల్ల తీర ప్రాంతాల్లో దోమల బెడద, విషపూరిత ఆహారపు పంటలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. అందుకే కాలువలకు పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేయాలనే సంకల్పంతో ఉందన్నారు. రైతులకు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, ఇరిగేషన్ ఎఇ సుధారాణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేరిచర్ల కనకరాజు సేవలు అభినందనీయం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు


కనకరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

శృంగవృక్షం సొసైటీ మాజీ అధ్యక్షులు పేరిచర్ల కనకరాజు గ్రామానికి, గ్రామ ప్రజలకు, రైతులకు అందించిన సేవలు అభినందనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం అన్నారు. ఇటీవల కనకరాజు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్‌తో కలిసి శృంగవృక్షంలోని కనకరాజు స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కనకరాజు మృతి అత్యంత బాధాకరమన్నారు. మంచి మనిషి, మానవతావాది, పరోపకారి అని కొనియాడారు. గ్రామం, సొసైటీ, రైతుల అభివృద్ధితో పాటు గ్రామస్తుల శ్రేయస్సు కోసం నిరంతరం పాటు పడ్డారని తెలిపారు. ముఖ్యంగా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేశారని గుర్తు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్ మాట్లాడుతూ గ్రామానికి మంచి పేరు తెచ్చి అందరి మన్ననలు పొందిన వ్యక్తి కనకరాజు అన్నారు. అటువంటి వ్యక్తి మృతి బాధాకరమని, గ్రామానికి కుటుంబానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నేత జుత్తిగ నరసింహామూర్తి, మండల కార్యదర్శి శేషపు అసిరియ్య, నేతలు పళ్లెం భీమన్న, కొటికలపూడి శ్రీను, కలిదిండి గోపాలరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఫ్లెక్సీల చించివేత

దళిత సంఘాల ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

ఫ్లెక్సీలు తొలగిస్తున్న పోలీసులు

మండలంలోని ఎల్‌బి చర్ల పంచాయతీ బైనపాలెం సెంటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు అంబేద్కర్ ఫ్లెక్సీలను చించేశారు. దీన్ని నిరసిస్తూ సోమవారం గ్రామ యూత్, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఫ్లెక్సీలను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివాదం పెద్దది కావడంతో రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్, రూరల్ ఎస్ఐ టి.వెంకట సురేష్, మొగల్తూరు ఎస్ఐ జి.వాసు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. తక్షణం నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో దళిత సంఘాలు ఆందోళన విరమించాయి. మరోవైపు నో ఫ్లెక్సీ జోన్‌గా ప్రకటించి సెంటర్లో ఉన్న ఫ్లెక్సీలను పోలీసులు దగ్గరుండి తొలగించారు. గ్రామం సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు సిఐ జి.దుర్గా ప్రసాద్ తెలిపారు.

నన్ను లైంగికంగా వేధిస్తున్నాడు..

మహిళా కళాశాల కరస్పాండెంట్‌పై అధ్యాపకురాలు ఆరోపణ

ప్రజాశక్తి - నరసాపురం

బిజిబిఎస్ మహిళా కళాశాల కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్‌పై కాలేజీలో తాత్కాలిక అధ్యాపకురాలుగా పనిచేస్తున్న వీరవల్లి గంగాలక్ష్మి ఆరోపణలు చేశారు. గత కొన్ని సంవత్సరాల నుంచి కరస్పాండెంట్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ తోటి అధ్యాపకురాలతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె తెలిపారు. లాడ్జీకి, సినిమాకు, సెలవు రోజుల్లో కాలేజీకి రమ్మని ఒత్తిడి చేసేవాడన్నారు. వికలాంగురాలినైన తనను విడిచిపెట్టాలని ఎన్ని సార్లు చెప్పినా అతని ఒంకర బుద్ధి మారలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అతని కోరిక తీర్చలేదన్న కోపంతో రెండు సార్లు ఉద్యోగం ఊంచి తొలగించాడన్నారు. చివరికి తోటి ఉద్యోగులు, విద్యార్థుల ఆందోళన చేయడంతో తిరిగి విధుల్లో చేర్చుకున్నాడని, వేధింపులు మాత్రం ఆగలేదని వాపోయింది. తోటి అధ్యాపకురాలు తనను బైక్‌పై తీసుకెళ్లి ఇంటి దగ్గర దించుతున్నందుకు కూడా ఆమెపై కక్షగట్టి బెదిరిస్తున్నాడని తెలిపింది. కొంత మంది విద్యార్థినులపై కూడా శ్రీనివాస్ వేధింపులకు పాల్పడారని, అయితే వారు చెప్పుకోలేకపోతున్నారని తెలిపారు. కాలేజీలో జరుగుతున్న అరాచకాలపై అధికారులు విచారించి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అధ్యాపకులు కె.మధుషాలిని, జ్యోతి, ఝాన్సీ, జి.సాగర్ పాల్గొన్నారు.

21 గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాం

ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఎం కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని 21 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపడుతున్నామని ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఎం కె.శ్రీనివాసరావు తెలిపారు. పేదవారికి ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు.

చిట్ - చాట్

ప్రశ్న: గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ఎలా సాగుతున్నాయి?

ఎపిఎం : ఉప్పుటేరు ప్రాంతం కావడంతో ప్రధానంగా సాగునీటి కాలువలు పూడికతీత పనులు చేపడుతున్నాం. పంట కాలువల్లో, పంట బోదెల్లో గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న : ప్రతిరోజూ ఎంత మంది కూలీలు పనిచేస్తున్నారు?

ఎపిఎం : మండలంలో ప్రతిరోజూ దాదాపు 2,400 మందికిపైగా కూలీలకు పని కల్పిస్తున్నాం.

ప్రశ్న : ఉపాధి హామీ కూలీలకు ఎన్ని నెలల వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది?

ఎపిఎం : నెల రోజులకు 43 వేల పని దినాలకు కోటి 34 లక్షల రూపాయలు ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాల్సి ఉంది.కూలీలకు రావాల్సిన నగదును వారి ఖాతాలకు నేరుగా వచ్చేలా చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: వేసవిలో కూలీలు ఇబ్బంది పడకుండా ఏం చర్యలు తీసుకున్నారు?

ఎపిఎం:వేసవిలో ఉపాధి కూలీలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. కనీస సౌకర్యాలు కల్పిస్తున్నాం. నీరు, ప్రథమ చికిత్స కిట్లు అందిస్తున్నాం.

ఆర్టిస్టు రఘుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు నాగరాజు

మిమిక్రీ ఆర్టిస్ట్ రఘుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామానికి చెందిన మిమిక్రీ ఆర్టిస్టు వడ్లాది రఘును ప్రోత్సహిస్తూ దాట్ల శ్రీదేవి ట్రస్ట్ ఆర్థిక చేయూతనిచ్చింది. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు చేతులమీదుగా సోమవారం అందజేశారు. కాళ్లకూరులో వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవాల్లో వడ్లాది రఘు చేసిన ఇంద్రజాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఆ సమయంలో నగదు ప్రకటించి సత్కరించారు.



ఎంఎల్ఎను కలిసిన చిన్న

ఎంఎల్ఎను కలిసిన డిసిఎంఎస్ ఛైర్మన్ చిన్న

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను ఉమ్మడి జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్న) మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి సత్కరించారు. నిజాయతో పని చేసినప్పుడే ప్రజలు గుర్తిస్తారని, అవినీతికి తావులేకుండా పనిచేసి సంస్థను పురోభివృద్ధిలో నడపాలని ఎంఎల్ఎ అన్నారు. అనంతరం చిన్నను అభినందించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

అద్దకం పని నేర్చుకుంటున్న విద్యార్థినులు

అద్దకం, చేతివృత్తుల్లో నైపుణ్యం చూపాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ టెక్స్ టైల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సంప్రదాయ చేనేత వస్త్రాల అద్దకం, వివిధ చేతి వృత్తులను ప్రోత్సహించే కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా 3 రోజుల కార్యశాలను కళాశాలలో ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ శోభారాణి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు సంప్రదాయ చేతి వృత్తుల్లో తమ నైపుణ్యాన్ని చూపితే ఎంపిక చేసిన కళాకృతులను దేశ వ్యాప్తంగా జరిగే ప్రదర్శనల్లో సదరు మంత్రిత్వ శాఖ ద్వారా ఉచిత ప్రయాణ ఖర్చులతో ప్రదర్శించుకునే వీలు కలుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యశాల నిర్వాహకులు సత్యనారాయణ, సుదీప్, కొమ్ముల మురళి మరియు అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

రోడ్డుపైనే వర్షపు నీరు..!

స్థానికుల అవస్థలు

ప్రజాశక్తి - ఉండి

మూడు రోజుల క్రితం కురిసిన వర్షం కారణంగా ఉండిలోని విలేకరుల కాలనీ, జంగాలకాలనీలో వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోయింది. వర్షపునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని, మలేరియా, డెంగీ వంటి జ్వరాల బారిన పడుతున్నామని తెలిపారు. మరలా కరోనా ప్రభావం ప్రారంభమవ్వడం, మరో పక్క వైరల్ జ్వరాలు వస్తుండడంతో కరోనా అనే భయం వెంటాడుతోందని పలువురు వాపోతున్నారు. విలేకరుల కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో రోడ్డుపైన నీరు నిలిచిపోతుందని వెంటనే అధికారులు స్పందించి కాలనీల్లో కచ్చా డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నిర్దేశిత గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 40 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డిఒ దాసిరాజు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలో మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆరు అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి నాలుగు, ప్రజారోగ్య సంబంధించి రెండు మొత్తం ఆరు అర్జీలను స్వీకరించినట్లు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్, అసిస్టెంట్ కమిషనర్, ఎంహెచ్ఒ, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండొచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైద్య లక్ష్మణరావు సూచించారు. పట్టణ ఎన్‌టిఆర్ జంక్షన్ ఆరోగ్యం కేంద్రం పరిధిలోని 9వ వార్డులో జరుగుతున్న వెక్టర్ కంట్రోల్ హైజిన్ కార్యక్రమాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చేసుకొని వారానికోసారి ఫ్రైడే డ్రైడే పాటించినట్లయితే దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్ట వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు వెంకటలక్ష్మి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీని పరిశీలిస్తున్న అధికారులు

అనారోగ్యంతో విద్యుత్ ఎడిఇ శ్రీనివాస్ మృతి

ప్రజాశక్తి - తణుకు

తణుకు విద్యుత్ సబ్ డివిజనల్ ఎడిఇగా పనిచేస్తున్న శ్రీనివాస్ (55) సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి తణుకు సబ్ డివిజనల్ కార్యాలయ పరిధిలోని అధికారులు, సిబ్బంది సంతాపం తెలియజేశారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు ఈ నెల 15వ తేదీన వివాహం జరిగింది.



శ్రీనివాస్ (ఫైల్‌ఫొటో)

2న ఆచంట మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - ఆచంట

జూన్ 2వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరగనుందని ఎంపిడిఒ వి.పూర్ణ బాబ్జి సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు విధిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉత్సాహభరితంగా వేసవి విజ్ఞాన తరగతులు

నరసాపురంలో..

ప్రజాశక్తి - నరసాపురం

ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో సోమవారం జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించారు. ప్రముఖ ఇంద్ర జాలికుడు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు టి.వెంకటేశ్వరరావు ఇంద్రజాల ప్రదర్శన చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రామలక్ష్మణరావు, జిల్లా కార్యదర్శి వై.అజయ్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెల్ ఫోన్ ఎక్కువగా ఉపయోగించడం, ప్లాస్టిక్ ఉపయోగించడం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. అనంతరం పిల్లలతో పాటలు, దేశభక్తి గేయాలు పాడించారు. సుధీర్‌మోహన్, డాక్టర్ అమ్మాజీ సూర్యంబాబు, బి.సత్యనారాయణ, వెంకటేశ్వరరావు హెచ్‌ఎం, శ్రీనివాస్ రిసోర్స్ పర్సన్స్ టీచర్లు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ఆసక్తికరంగా నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఇ.శ్రీనివాస్‌రావు తెలిపారు. రిసోర్స్ పర్సన్లు ప్రత్తి వీరస్వామి, జనార్ధన్‌రావు విద్యార్థులకు కథలు వినిపించి, పుస్తకాలు చదివించారు. కాగితాలతో వివిధ రకాల బొమ్మలు తయారు చేయడం నేర్పించారు. ఉప్పెల్ల శ్రీనివాసరావు జాతీయ జెండాలో రంగులు, అశోక చక్రం గురించి విద్యార్థులకు వివరించారు. గరికపాటి బాపయ్యా శర్మ భారతదేశ ఆర్థిక వ్యవస్థ గురించి వివరించారు.

తాడేపల్లిగూడెంలో..

పెనుమంట్ర : మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 28వ రోజు సోమవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయంలో గ్రంథాలయ మాస్టర్ పిటి.శివకుమార్ విద్యార్థులతో జికె బుక్స్ చదివించారు. పిల్లల చేత లెమన్ స్పూన్, చెస్ ఆటలు ఆడించి, బహుమతులు అందజేశారు. శిబిరంలో విద్యార్థులు పి.రాజేష్, కె.సతీష్ రెడ్డి, డి.జయంత్ నీల్ రెడ్డి, డి.జశ్వంత్ అమర్‌రెడ్డి, బివిఆర్.రేవంత్, ఎస్.సుభాష్, వై.హర్ష, ఎస్.కేశవ్‌సాయిరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - మొగల్తూరు

రేషన్ పంపిణీలో ఎండియు వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసినందు వల్ల రేషన్ షాపుల వద్దే డీలర్లు వినియోగదారులకు నిత్యవసర సరుకులు అందించాలని తహశీల్దార్ కె.రాజ్‌కిషోర్ సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల చౌకడిపో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపులను పూర్వ పద్ధతిలోకి తీసుకొచ్చిందని, వినియోగదారులు ఎటువంటి ఇబ్బందులూ పడకుండా షాపుల వద్దే రేషన్ అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. రేషన్ షాపుల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తున్నందున వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు రానివ్వకూడదన్నారు. ఈ సమావేశంలో డిటి సుగుణ సంధ్య, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ రాజ్‌కిషోర్

గణపవరంలో అన్న సమారాధన

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం సువర్చలా సహిత ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం స్థానిక ఆంజనేయ ఆలయం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణపవరం, సరిపల్లి గ్రామాలకు చెందిన మూడు వేల మంది ప్రజలు పాల్గొన్నారని ఆలయ కమిటీ ఛైర్మన్ వంకాయల రామారావు తెలిపారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరులోని ప్రభుత్వ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీ వాసులు రాపాక విక్టోరియా రాణి, కుసుమే రాణి, జామి నాగమణి, మాగాటి దుర్గా భవాని, సహా సుమారు 163 మంది కలెక్టర్‌కు, ఎంఎల్‌ఎకు వినతిపత్రాలు అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని జరుగుతున్న పిజిఆర్‌ఎస్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణికి ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే ఎంఎల్ఎ పితాని సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో మురుగునీరు పారుదల, తాగునీటి వసతి, పారిశుధ్యం తదితర సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

యోగాంధ్రాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

యోగా కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని వలంధర్ రేవులో ఏర్పాట్లను ఆర్డిఒ దాసిరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం 'యోగాంధ్ర 2025' పేరుతో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. నెల పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యోగా ప్రదర్శనలు, పోటీలు, శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 27న నరసాపురం వశిష్ట గోదావరి ఒడ్డున ఉదయం 6 గంటలకు యోగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జెసి వెంట డిఎస్‌పి జి.శ్రీవేద, తహశీల్దార్ ఐవివి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఉన్నారు.

నేడు నరసాపురం వశిష్ట గోదావరి ఒడ్డున యోగా

భీమవరం : నరసాపురం వశిష్ట గోదారి ఒడ్డున మంగళవారం యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ నెల 21 నుండి జూన్ 21వ తేదీ వరకూ నెల పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యోగా ప్రదర్శనలు, పోటీలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహణకు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దీనిలో భాగంగా ప్రసిద్ధ పర్యాటక కేంద్రాలు, చారిత్రక ప్రాంతాలలో ప్రత్యేక యోగా ప్రదర్శనలు నిర్వహించి, యోగాభ్యాసం పట్ల ప్రజలలో అవగాహన పెంచాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగా గురువులు, యోగా శిక్షకులు, వాలంటీర్లు, యోగాభ్యాసకులు, సాధారణ ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచి నెల రోజులు యోగా శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచి మట్టా కుమారి రాము, సెక్రటరీ కె.సత్యనారాయణ తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మార్టేరు శ్రీనరసింహస్వామి మండపం వద్ద యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు పడాల రామచంద్ర రెడ్డి మాట్లాడారు. అందరూ యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల మాజీ టిడిపి అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి (బుల్లా), టిడిపి మార్టేరు గ్రామ అధ్యక్షులు కోనాల శ్రీనివాస్‌రెడ్డి, యోగా ఆర్గనైజర్ బండి ప్రసాద్ పాల్గొన్నారు

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

మోటార్ సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సిఐ బోణం ఆది ప్రసాద్ తెలిపారు. జిల్లా ఎస్‌పి, తాడేపల్లిగూడెం డిఎస్‌పి ఆదేశాల మేరకు పట్టణ ఎస్ఐ బాదం.శ్రీనివాస్, పి.నాగరాజు సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి మోటార్ సైకిల్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్ట ఉప్పరగూడెం గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్ నుండి స్థానిక శేషమహల్ రోడ్డు, ఆర్ఆర్ హాస్పటల్ వద్ద చోరీ చేసిన మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనాలకు సరైన భద్రత కలిగి ఉండి వాహనాలను భద్రపర్చుకోవాలన్నారు. రోడ్ల మీద పార్కింగ్ చేసినప్పుడు మోటార్ సైకిల్ తాళాలను సరిచూసుకోవాలని సూచించారు. మోటార్ సైకిల్ చోరీ చేసిన దుర్గాప్రసాద్‌ను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారని సిఐ ఆది ప్రసాద్ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లతో సిఐ, ఎస్ఐలు

కొబ్బరి మొక్కలు పంచాయతీకి వర్తింపజేయాలని వినతి

ప్రజాశక్తి - నరసాపురం

ఉపాధి హామీ చట్టంలో నాటిన కొబ్బరి మొక్కలను గ్రామ పంచాయతీకి వర్తింపజేయాలని ఎల్‌బిచర్ల గ్రామానికి చెందిన జల్లి ఆశీష్‌కుమార్, వాటాల రాధాకృష్ణ జిల్లా అధికారులకు సోమవారం విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని శ్మశానవాటిక నుంచి గంగాలమ్మ ఆలయం వరకూ పుంత రహదారి పక్కన కొల్లాటి నాగలక్ష్మి కొబ్బరి మొక్కలు నాటుకున్నారు. ఆ మొక్కలు పంచాయతీ స్థలంలో నాటి నందు వల్ల పంచాయతీకి చెందుతాయని 2022 డిసెంబర్ 23న గ్రామ పంచాయతీ తీర్మానం చేసింది. 2023 సెప్టెంబర్ తొమ్మిదిన పంచాయతీ కార్యదర్శి కొల్లాటి నాగలక్ష్మికి నోటీసు జారీ చేశారు. ఇందుకు భిన్నంగా ప్రస్తుత గ్రామ సర్పంచి, గ్రామ కార్యదర్శి కొల్లాటి నాగలక్ష్మికి అనుకూలంగా వ్యవహరిస్తూ పంచాయతీ స్థలంలో నాటిన కొబ్బరి హక్కును నాగలక్ష్మికి వర్తించేలా వ్యవహరిస్తున్నారని కలెక్టర్‌కు, డిఎల్‌పిఒకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. అధికారులు స్పందించి పంచాయతీ స్థలంలో నాటిన కొబ్బరి మొక్కలను గ్రామ పంచాయతీకి చెందేలా చేసి పంచాయతీ ఆదాయానికి గండి పడకుండా చూడాలని పేర్కొన్నారు.

కడప తరలిన టిడిపి నేతలు

పాలకొల్లు : కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగే మహానాడులో పాల్గొనటానికి పాలకొల్లు నుంచి టిడిపి నేతలు, కార్యకర్తలు బస్ లు, కారుల్లో బయలుదేరి వెళ్లారు. పాలకొల్లు నియోజకవర్గం నుంచి 5 బస్సులు, 30 కారుల్లో టిడిపి నేతలు సోమవారం సాయంత్రం వెళ్లారు.

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 28/2008

Between:
లంక రాంబాబు -వాది
AND
కొరుప్రోలు నాగరాజు (died) వగైరా -ప్రతివాద్లు

వాది దాఖలు చేసిన పేపరు ప్రకటన

దావా సమన్లు:

D-10: మేడిశెట్టి రమణమ్మ, W/o. అప్పారావు, వయస్సు 44 సం॥లు, గృహిణి, దొండపూడి, గోపాలపురం మండలం, ప॥గో॥జిల్లా.

D-11: నవుడు నాగలక్ష్మి, W/o. నూకరాజు, వయస్సు 37 సం॥లు, గృహిణి, జంగారెడ్డిగూడెం, ప॥గో॥జిల్లా.

D-12: సబ్బారపు ఏసమ్మ, W/o. వాసు, వయస్సు 36 సం॥లు, గృహిణి, పట్టిసీమ, ప॥గో॥జిల్లా.

D-13: మేడిశెట్టి రజని, W/o. వెంకన్న, వయస్సు 32 సం॥లు, గృహిణి, దొండపూడి, గోపాలపురం మండలం, ప॥గో॥జిల్లా.

D-14: కైసర్ల వీరబాబు, W/o. సాంబమూర్తి, వయస్సు 45 సం॥లు, వ్యవసాయం, జంగారెడ్డిగూడెం, ప॥గో॥జిల్లా.

D-15: కైసర్ల చిన్న, S/o. సాంబమూర్తి, వయస్సు 39 సం॥లు, వ్యవసాయం, జంగారెడ్డిగూడెం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో మీకు దావా సమన్లు ఎన్నిసార్లు పంపినా మీరు తీసుకోనందున మీకు దావా సమన్లు నిమిత్తం మీరు పై కోర్టు వారి ఎదుట హాజరు అగు నిమిత్తం ది. 18-6-2025వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీకు ప్లయింటు పరిహారములపై ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల **ది. 18-6-2025వ తేదీని ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై తెలియపరచుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించడమగును.

వాది తరపు న్యాయవాదులు
సాదే నరసింహారావు
బొగ్గవరపు సత్యన్నారాయణమూర్తి
పెద్దాపురం పెద్దాపురం
ది.25-5-2025 సెల్: 9885084194

పబ్లిక్ నోటీస్

నా క్లయింటును ప॥గో॥జిల్లా, పాలకోడేరు మండలం, గొల్లలకోడేరు గ్రామ కాపురస్తులు శ్రీ ముదుండి బంగార్రాజు గారి భార్య: ముదుండి పద్మావతి గారు మాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియచేయునది.

మా క్లయింటు ముదుండి పద్మావతి దేవి గారి తల్లి గారైన అల్లూరి వెంకట సుబ్బరాజు గారి భార్య అల్లూరి అనసూయదేవి గారి మరణానంతరము మా క్లయింటు తల్లి గారు వ్రాసిన వీలునామా ప్రకారము ది. 27-01-2025 నుండి మా క్లయింటుకు చెందిన ఆస్తులపై మా క్లయింటు ముదుండి పద్మావతి దేవి గారికి చెందిన ఆస్తులపై ఇతరులు ఎవ్వరికీ ఎట్టి అధికారం లేదనినూ సదరు ఆస్తులకు ఎవరైన తనకాలు, కౌలు, అగ్రిమెంట్‌లు, మరియు అమ్మకములు చేసిన అట్టివి చెల్లవని ఈ నోటీసు ద్వారా తెలియచేయుచున్నాము. ఈ నోటీసులో ఆస్తులను ఎవరైనా అగ్రిమెంట్స్, లీజు, తనకా, అమ్మకము, కొనుగోళ్ళు చేసిన ఎడల అట్టివారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోబడును. అని ఈ నోటీసు ద్వారా తెలియచేయుచున్నాము.

ఆస్తుల వివరములు:-

1. A.K.S జిల్లా, రాజోలు మండలం, శివకోడు గ్రామంలోని R.S. No: 726 యా.2.06 సెంట్లు A.K.S జిల్లా, రాజోలు మండలం, చింతలపల్లి గ్రామంలోని, R.S. No: 141/1 యా.2.38 సెంట్లు R.S. No: 142 యా.0.41 1/3 సెంట్లు, R.S. No: 71/18, 16 యా.0.32 సెంట్లు కొబ్బరితోట మరియు R.S. No: 141/G, యా.1.90 సెంట్లు మరియు

2. ప॥గో॥జిల్లా, గణపవరం మండలం, కేశవరం గ్రామంలోని D.No: 1-57/1, RCC భవనం మరియు దానికి చెందిన 1408 చ.గ స్థలమును, R.S. No: 185/7 యా.0.66 సెంట్లు R.S. No: 185/8 యా.0.47 సెంట్లు, R.S. No: 185/10, యా.0.06 సెంట్లు, R.S. No: 184/1 యా.1.10 సెంట్లు, R.S. No: 184/2 యా.0.96 సెంట్లు, R.S. No: 184/3 యా.0.20 సెంట్లు, R.S. No: 184/6 యా.0.77 సెంట్లు, R.S. No: 184/7 యా.0.40 సెంట్లు, మరియు

3. ప॥గో॥జిల్లా, గణపవరం మండలం, కేశవరం గ్రామంలోని SBI Branch A/c 11557324941, CIF No: 81276280320 అల్లూరి అనసూయ దేవి గారికి చెందిన నగదును మరియు MRF కంపెనీ వారి ప్రాథమికంగా కేటాయించిన షేర్లు 487 మరియు పోస్టల్ డిపాజిట్లు మా క్లయింటుకు మాత్రమే చెందుతాయని ఇతరులు ఎవ్వరికీ ఏవిధమైన హక్కులు లేవని ఈ నోటీస్ ద్వారా తెలియచేయుచున్నాము.

గూడూరి సాంబమూర్తి
సెల్: 99487 54306
గరికిముక్కు సుబ్బయ్య
సెల్: 99595 58600
అడ్వకేట్స్, భీమవరం

ప్రకటన

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు
ఇ.పి.నెం. 79/2018
ఒ.యస్.నెం. 111/2017

బిట్వీన్:
మెట్టపల్లి సాంబమూర్తి ...డిక్రీహోల్డర్
మరియు
మారుమూడి ధర్మతేజ ...జడ్జిమెంటుడెటార్

డిక్రీహోల్డర్ దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబరు గల ఇ.పి వారంటు గ్రంథంలో జడ్జిమెంటు డెటార్ అయిన మారుమూడి ధర్మతేజ, S/o. లేటు కాంతారావు, కొవ్వూరుగూడెం, H/o. చింతలపూడి, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా వారికి పై కోర్టులో **ది. 29-06-2025 సం.రం తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** వాయిదా అయివున్నది. కావున సదరు జడ్జిమెంటు డెటార్ స్వయముగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి, తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు ఇ.పి వారంటు గ్రంథము తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు అడ్వకేట్సు
ది.26-05-2025 అశోక్‌నగర్, ఏలూరు

భూముల కౌలు టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

దేవదాయ ధర్మదాయ శాఖ, పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, సిద్ధాంతం గ్రామములో గల శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంనకు చెందిన సిద్ధాంతం గ్రామంలో గల ఈ క్రింది తెలిపిన సర్వే నెంబరులో గల భూములు సాగు చేసుకొనే హక్కునకు 2025-2026 నుండి 2027-2028 సంవత్సరములకు ది. 05-06-2025 గురువారం ఉదయం గం॥ 9.00లకు సదరు దేవాలయం వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున టెండర్ కమ్ బహిరంగ వేలం పాట జరుపబడును. కావున ఆసక్తి గలవారు పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

వ. నెం.	గ్రామం	సర్వే నెంబరు	విస్తీర్ణం య.సెంట్లు	ధరావత్తు సొమ్ము	బహిరంగ వేలం తేదీ సమయం, ప్రదేశం	సేద్యం చేసుకొనే కాలం
1	సిద్ధాంతం	394	1.98	5000/-	ది.05-06-2025 గురువారం ఉదయం గం॥ 09.00లకు గల శ్రీ స్వామి వారి ఆలయం వద్ద	2025-2026 నుండి 2027-2028 వరకు (3 సం॥రంలు)

ముఖ్య షరతులు:
మిగతా పాట షరతులు వివరములు పాట కాలమందు చదివి వినిపించబడును.
ఇతర వివరములు మరియు మిగిలిన నియమ నిబంధనలు ఆఫీసు పనిచేయు వేళలో ఈక్రింది అడ్రస్సు వారిని సంప్రదించి తెలుసుకోగలరు.

సింగిల్ ట్రస్టీ - శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానం
సిద్ధాంతం, 25-5-2025 సిద్ధాంతం, సెల్: 9849114191